


శక్తి మొత్తం మీలోనే ఉంది,
మీరు ఏమైనా చేయగలరు,
అన్నింటినీ సాధించగల సమర్థులు.

Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS


irspublications12@gmail.com

మంగళవారం 23 సెప్టెంబర్ 2025 | చిత్తూరు | సంపుటి: 01 - సంచిక : 109 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# నెలకు ఓ రోజు రైతుల వద్దకు..

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అసెంబ్లీలో బాబు సూచన



అమరావతి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నెలకు ఒక రోజు పొలం దగ్గరకు వెళ్లి రైతులతో మాట్లాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. వచ్చే అక్టోబరు నుండి ప్రతినెలా రైతుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు విని పరిష్కరిస్తామని, దీనికి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం వ్యవసాయంపై లఘు చర్చ జరిగింది. తొలుత వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. అనంతరం సిఎం వ్యవసాయ రంగంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ తరువాత మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తాను చేసే ప్రతి నిర్ణయమూ రైతుకోసమేనని, తాను రైతు కుటుంబం నుండి వచ్చానని, ఐటి గురించి మాట్లాడుతున్నా వ్యవసాయంపైనే ఆలోచన ఉంటుందన్నారు. నీరుచెట్టు, రిజర్వాయర్లు, చెక్‌డ్యాములు, కాలువలు ఇలా ప్రతి అంశాన్ని వ్యవసాయానికి

- మిగతా 2లో..

# డిజిటల్ పరిపాలన

## సాంకేతికతతోనే ప్రజలకు పాలన మరింత చేరువ

## 28వ జాతీయ ఇ-గవర్నెన్స్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: : ప్రభుత్వ పరిపాలనలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అత్యంత ముఖ్యమైన అంశమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సాంకేతికతతోనే ప్రజలకు పాలనను మరింత చేరువ చేసే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ఐటి, సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖలోని నోవాటల్ హొటల్‌లో నిర్వహించిన జాతీయ ఇ-గవర్నెన్సు సభకు తొలి రోజు సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'సివిల్ సర్వీసెస్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' థీమ్‌తో జరుగుతున్న ఈ సదస్సులో చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ద్వారా

- మిగతా 2లో..






## రేపు తిరుమలకు

# సీఎం చంద్రబ్రాబు

## బందోబస్తు ఏర్పాట్లలో అధికారులు

తిరుపతి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: ఈ నెల అక్టోబర్ రేపు ఎల్లుండి (బుధ, గురువారం) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించడానికి జిల్లాకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు, బందోబస్తు విషయంలో చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వరాదని జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, జెసి శుభం బన్సల్ తో కలిసి అధికారులను ఆదేశించారు.సోమవారం ఉదయం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ముందస్తు భద్రత ఏర్పాట్లు లో భాగంగా జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి

- మిగతా 2లో..




## ఆదానీకి కారుచౌకగా

# బీహార్ భూములు..!



**బీహార్‌లోని భాగల్పూర్ జిల్లాలోని పిర్పైంటీలో నిర్మించబోయే బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రం కోసం బీహార్‌లోని నితీష్‌కుమార్ ప్రభుత్వం అదానీ కంపెనీ కారు చౌకగా వెయ్యి ఎకరాలు కట్టబెట్టింది. ఎకరాకు కేవలం ఒక్కరూపాయి చొప్పున 25 సంవత్సరాలపాటు లీజుకిచ్చింది. అయితే తమ భూముల్ని అన్యాయంగా లాక్కొని.. సరిగా నష్టపరిహారం ఇవ్వకుండానే ప్రభుత్వం అదానీ కంపెనీకి కట్టబెట్టిందని మామిడి, లిచీ పండ్ల రైతులు వాపోతున్నారు. ఈ బొగ్గువిద్యుత్ కేంద్రం వల్ల తీవ్రంగా గాలి కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.**

## ఎకరాకు రూపాయి చొప్పున 25 సంవత్సరాలపాటు లీజుకిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం


హైదరాబాద్, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: ప్రధాని నరేంద్ర మోడీ బీహార్‌లోని పూర్ణియాలో సెప్టెంబర్ 15న దాదాపు నలభై వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిల్లో రూ. 25 వేల కోట్లతో అదానీ నిర్మించబోయే ఈ బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రం కూడా ఉండడం గమనార్హం. ఈ ప్రాజెక్టును మోడీ ప్రారంభించబోయే రెండు రోజుల ముందే (సెప్టెంబర్ 13) అదానీ పవర్ కంపెనీ.. బీహార్ రాష్ట్ర పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్ (బిఎస్‌పిజిసిఎల్)తో 25 విద్యుత్ సరఫరా ఒప్పందం (పిఎస్ఎ)పై సంతకం చేసింది. ఈ కంపెనీ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను బీహార్ రాష్ట్ర విద్యుత్ సంస్థలకు కిలోవాట్‌కి రూ. 6.07కి విక్రయించనున్నారు. ఎకరాకు రూపాయి చొప్పున 25 సంవత్సరాలపాటు 1,020 లీజుకిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మాత్రం అన్యాయం చేసింది. వారి దగ్గర నుంచి బలవంతంగా తీసుకున్న భూములకు మాత్రం ఒకేసారి నష్టపరిహారం ఇవ్వలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూములు వాళ్లకిచ్చేసి తామెలా బతకాలని వారు ఆవేదన చెందుతున్నారు. బీహార్‌లో 38 జిల్లాల్లో 28 జిల్లాలు వరద ప్రభావిత భూములు. మిగతా పది జిల్లాల్లో అంతో ఇంతో సారంవంతమైన భూములున్నాయి. పిర్పైంటిలోని ఎక్కువ శాతం మంది ప్రజలు పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడినవారే. అయితే ఇప్పుడు మిమిడి, లిచీ పండ్లను సాగు చేస్తున్న భూములను రాష్ట్ర ప్రభుత్వం ముందు బంజరు భూములుగా జాబితా చేసి.. వీటిని అదానీ కంపెనీకి ఇచ్చిందని అక్కడి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అదానీ నిర్మించబోయే పవర్ ప్లాంట్ కంపెనీ పనులు 2014లో ప్రారంభమయ్యాయి. 1,320 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించడానికి బీహార్ రాష్ట్ర పవర్ జనరేషన్ లిమిటెడ్ కంపెనీ, ఎన్‌హెచ్‌పిసి లిమిటెడ్ కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. అంటే ఈ కంపెనీని అప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలని ప్రయత్నించింది. అయితే ఇప్పుడు అనూహ్యంగా ఈ కంపెనీని అదానీకి అప్పగించారు. పదేళ్ల తర్వాత ప్రభుత్వం ఈ కంపెనీ నుంచి ఎందుకు తప్పుకుని ప్రైవేటుకు అప్పజెప్పింది? అనే ప్రశ్నలు రాష్ట్ర ప్రజల్లో మెదలుతున్నాయి. ఇప్పటికే భాగల్పూర్ జిల్లాలో 2,340 మెగావాట్ల సామర్థ్యం గల కహల్గావ్ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ ఉంది. అదే జిల్లాలో ఇది రెండో పవర్ సేటషన్. కహల్గాన్ పవర్ ప్లాంట్‌కి కిలోమీటర్ల దూరంలోనే మరో పవర్ ప్లాంట్ నిర్మించడం..పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ పరిశోధకుడు సుభాసిస్ డే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వాతావరణ ప్రభావం వల్ల రాష్ట్రంలో కేన్సర్ రోగులు పెరిగిపోతున్నారు. ఇప్పుడు అదానీ పవర్ ప్లాంట్‌తో ప్రజారోగ్యం తీవ్ర సంక్షోభంలో పడనుంది.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## అమరావతిలో రూ.150కోట్లతో

# వరల్డ్ క్లాస్ స్టేట్ లైబ్రరీ

## 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు - శాసనసభ ప్రశ్నోత్తరాల్లో నారా లోకేష్



అమరావతి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: అమరావతిలో రూ.150కోట్లతో రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వరల్డ్ క్లాస్ స్టేట్ లైబ్రరీ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాసనసభలో వెల్లడించారు. సోమ వారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో " రాష్ట్రంలో గ్రంధాలయాలు" , లైబ్రరీల అభివృద్ధి, సెస్సు బకాయిలుపై సభ్యులు మండలి బుద్ద ప్రసాద్, పల్లెసింధూరరెడ్డి, గణబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. సెంట్రల్ లైబ్రరీ 24 నెలల్లో పూర్తి చేసేందుకుచర్యలు చేపడ తామన్నారు. రాష్ట్రంలో లైబ్రరీలకు సంబంధించి మౌలిక వసతులతో పాటు మ్యాన్యువల్ స్క్రిప్ట్‌ను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి లోకేష్ వెల్లడించారు. రాష్ట్రంలో గ్రంధాలయాల అభివృద్ధికి శోభా డెవలపర్స్‌అనే సంస్థ రూ.100 కోట్లు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చింద న్నారు. దాతల సహకారంతో గ్రంధాలయాలను అభివృద్ధిచేసేందుకుచర్యలు తీసుకుంటున్నట్లు లోకేష్ సభకు తెలిపారు. విశాఖపట్టణంలో రూ.20కోట్లతో మోడల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు, నిరుద్యోగ యువతకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో పిపిపి విధానం కింద రాష్ట్ర వ్యాప్తంగా 200 గ్రంధాలయాలను డిజిటల్ గ్రంధాలయాలుగా మార్చడం

- మిగతా 2లో..

## నెలకు ఓ రోజు రైతుల వద్దకు..

(మొదటి పేజీ తరువాయి)

అనుకూలమైన ఆలోచనలే చేశానని పేర్కొన్నారు. సాగునీరు, వ్యవసాయ అభివృద్ధికే నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. మొబైల్ రైతుబజార్లతో ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేలా చేస్తామని తెలిపారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయడంపైనే తన ఆలోచన ఉంటుందని, ప్రతి పంటకూ గిట్టుబాటు ధర దక్కేలా చేస్తున్నామని చెప్పారు.

**ఎరువులు పురుగమందులపై అవగాహన:** రైతులకు పురుగుమందులు, ఎరువులు వాడకంపై అవగాహన కల్పించాలని సిఎం అన్నారు. వరదలు, వర్షాలతో ఎరువు కొట్టుకుపోవడం వల్ల బూస్టర్‌డోస్ ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 1.16 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది అదనంగా పంట వేశారని పేర్కొన్నారు. 25 శాతం మేర యూరియా ఎక్కువ వినియోగించారని, దాణా పెంచడానికి కూడా యూరియాను వినియోగించుకున్నారని వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు 16.70లక్షల టన్నులయూరియా రాష్ట్రంలో అందుబాటులో ఉందని చెప్పారు. యూరియా ఎక్కువ వినియోగించడం వల్ల పాలు కూడా కలుషితం అవుతున్నాయని, యూకలిప్టస్, పసుపు పంటలకూ వాడేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో హెక్టారుకు 255 కిలోల యూరియా వినియోగిస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని పేర్కొన్నారు. భూసారం దెబ్బతింటోందని, ప్రజారోగ్యంతోపాటు పంట ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం పడుతోందని వివరించారు. కొత్త తెగుళ్లతో పంటలు దెబ్బతింటున్నాయని చెప్పారు. పిఎం ప్రణమ్ కింద రసాయన ఎరువులు వినియోగం తగ్గించిన రైతులకు రూ.800 సబ్సిడీ రైతుల ఖాతాకు బదిలీ చేస్తున్నామని వివరించారు. నీటి నిర్వహణను కూడా మెరుగుపరిచామని 90 శాతం నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు. ఆక్వాకల్చర్‌తోపాటు మెరైన్ ఎకానమీ పైనా దృష్టి పెడుతున్నా మని వివరించారు. రూ.1000 కోట్లతో ఆక్వా రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

## డిజిటల్ పరిపాలన

(మొదటి పేజీ తరువాయి)

అందే పౌర సేవలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి సాంకేతికత కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ఐటి, ఇ-గవర్నెన్సు అంశాలతో పాలనలో మార్పులు వచ్చాయని వివరించారు. సాంకేతికతను అందిపుచ్చుకుని గతంలోనే ఉమ్మడి ఎపిలో ఇ-సేవ, మీ-సేవ ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌర సేవలను ప్రజల దగ్గరకు తీసుకెళ్లామన్నారు. ఇ-ఫైల్స్, ఇ-కేబినెట్ లాంటి అంశాలతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడిందని తెలిపారు. ఈ వ్యవస్థలు అమలు చేసే సమయంలో సైబర్ సెక్యూరిటీ కూడా అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఐటితో వచ్చిన విస్తృత ప్రయోజనాలను అందిపుచ్చుకోగలుగుతున్నా మన్నారు. ఈ ప్రక్రియను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్సును అమలు చేస్తున్నామని వివరించారు. మొత్తం 751 పౌర సేవలను వాట్సాప్ ద్వారా పౌరులకు అందిస్తూ పాలనను వారి మొబైల్ ఫోన్ల వరకూ తీసుకెళ్లామన్నారు.

**సంజీవని ప్రాజెక్టు దేశవ్యాప్తంగా అమలుకు అవకాశం:** రాష్ట్రంలో వైద్య సేవలను టెక్నాలజీతో అనుసంధానం చేసే సంజీవని ప్రాజెక్టు చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తున్నామని, త్వరలో ఈ వ్యవస్థను దేశం మొత్తం అమలు చేసేందుకు అస్కారం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టి సంస్థలతో కలిసి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్వాంటం కంప్యూటర్ సేవలను ప్రభుత్వాలు, విద్య, వైద్య సంస్థలు వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. క్వాంటం వ్యాలీతో ఎకో సిస్టం ఏర్పాటవుతుందన్నారు. క్వాంటం కంప్యూటర్లు, పరికరాల తయారీ సంస్థలు కూడా పెట్టుబడులతో ముందుకు వచ్చాయని తెలిపారు. టెక్నాలజీపరంగా సేవలు, ఉద్యోగాలు, ఉత్పాదన తదితర రంగాలు కూడా వేగంగా మారుతున్నాయని, ఈ దృష్ట్యా వచ్చే పదేళ్లూ మన దేశానికి అత్యంత కీలకమని అన్నారు. ప్రధాని మోడీ ఇచ్చిన స్వదేశీ ఉత్పత్తుల నినాదాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. దానికి అనుగుణంగా దేశంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్స్‌గా మారాలన్నారు. సమీప భవిష్యత్తులో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్ సిటీ, మెడ్ టెక్ పార్కుల ద్వారా జాతీయ అభివృద్ధిలో రాష్ట్రం ప్రధాన భాగస్వామి అవుతుందని పేర్కొన్నారు. అనంతరం డిజిటల్ ఎపి సంచికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

**దేశాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర..:** కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉత్తమ పద్ధతులను మార్పిడి చేసుకోవడానికి ఇ-గవర్నెన్స్ సమావేశం ఒక వేదికగా పనిచేస్తుందన్నారు. అమరావతిలో క్వాంటం డేటా సెంటర్, శ్రీహరికోటలో అదనపు స్పేస్ లాంచ్ ప్యాడ్ వంటి రాబోయే ప్రాజెక్టులను సూచిస్తూ, భారతదేశావృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఇ-ఆఫీస్ ప్లాట్‌ఫాం గణనీయంగా విస్తరించిందని, ఫైల్ కదలిక స్థాయిలను తగ్గించడం, సమర్థవంతమైన నిర్ణయం తీసుకోవడాన్ని ప్రారంభించడం ద్వారా సెంట్రల్ సెక్రటేరియట్‌ను వేగవంతం చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిఎఆర్‌పిజి సెక్రటరీ వి.శ్రీనివాస్, ఎన్ఐసి అదనపు కార్యదర్శి అభిషేక్ సింగ్, డిఎఆర్‌పిజి అదనపు కార్యదర్శి పునీత్ యాదవ్, జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్, రాష్ట్ర ఐటి సెక్రటరీ కాటమనేని భాస్కర్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, విశాఖ ఎంపి శ్రీభరత్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### రేపు తిరుమలకు
## సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్న నేపథ్యంలో ఏర్పాట్లల్లో ఎలాంటి లోపాలకు తావివ్వరాదని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటించే అన్ని ప్రదేశాల్లో కూడా విధులు కేటాయించిన అధికారులు అందరూ కూడా సమన్వయంతో బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు. మెడికల్ క్యాంపు, అంబులెన్స్ ఏర్పాట్లు ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయం చేసుకోవాలన్నారు. సేఫ్టీ రూమ్ అధునాతన లైఫ్ సపోర్ట్ ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, ఏపీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, శానిటేషన్ ఏర్పాట్లు, కాన్వాయ్ వెహికల్స్ ఏర్పాటు, హెలిపాడ్ నందు భద్రత ఏర్పాట్లు, ప్రోటోకాల్ అంశాలు తదితర విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. %ూూ%లో తాజ్ హొటల్ సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద భద్రత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్.పి సుబ్బరాయుడు తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, జిల్లారెవెన్యూ అధికారి నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్ డి ఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి,జిల్లాఅధికారులు, తదితరులు పాల్గొన్నారు

### అమరావతిలో రూ.150కోట్లతో
## వరల్డ్ క్లాస్ స్టేట్ లైబ్రరీ

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియో జకవర్గాల్లో మోడల్ లైబ్రరీలను చేపడుతున్నామని ప్రస్తుతం 13 జిల్లాల్లో మాత్రమే జిల్లా గ్రంథాల యాలు ఉన్నాయన్నారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన 26 జిల్లాల్లో జిల్లా గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తామన్నారు.

**496 గ్రామాలు షెడ్యూల్డ్ ఏరియాలుగా ప్రతిపాదనలు: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**

గిరిజన జనాభా 50శాతం కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాలుగా ప్రకటించేందుకు 496 గ్రామాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శాసనసభలో స్పష్టం చేశారు. మైదాన ప్రాంతాల్లోని గిరిజన గ్రామా లను షెడ్యూల్డ్ ప్రాంతాల జాబితాలో చేర్చని మాట వాస్తవమేనా? అని సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గిరిజనుల విద్య, ఆరోగ్యం, ఉపాధి, రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధి కి ప్రభుత్వం కష్టపడి పనిచేస్తోందన్నారు. "బాబు జగజ్జీవన్‌రామ్" పథకం కింద ప్రతి కుటుంబానికి నెలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్తు అందజేస్తు న్నట్లు మంత్రి సభ్యులకు సమాధానమిచ్చారు.

### ప్రొబేషన్ పూర్తికాని విధులకు గైర్హాజరైన వారిని
# పీడీ, ఏపీసీగా కొనసాగిస్తారా..?

అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: వడ్డించే వాడు మా వాళ్లయితే ఎక్కడ కూర్చుంటే ఏముంది అన్న చందంగా మారింది జిల్లాలోని కీలక విభాగాలలో పనితీరు. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న విధంగా మారింది కార్యాలయాలలో పనితీరు. నేను చెప్పిందే చట్టం నేను ఆచరించిందే తీరు అని నియంత పోకడలతో కిందిస్థాయి ఉద్యోగులకు తలనొప్పిగా మారిన వైనం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పెచ్చుమీరుతున్న జిల్లా పాలనాధికారి పట్టించుకోవడం లేదు, ఇలాంటి అధికారులపై ఎవరికి మొరపెట్టుకోవాలో దిక్కు తెలియక సతమతమవుతున్న ఉద్యోగులు. సర్వ శిక్షా అభియాన్ అనేది భారత ప్రభుత్వం యొక్క ప్రధాన కార్యక్రమం , దీనిని 2001-02లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రారంభించారు, ఇది భారత రాజ్యాంగంలోని 86వ సవరణ ద్వారా నిర్దేశించిన కాలపరిమితిలో ప్రాథమిక విద్యను సార్వత్రికీకరించడానికి 6-14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించడానికి ఉద్దేశించబడింది. సర్వ శిక్షా అభియాన్ విద్యను ప్రాథమిక హక్కుగా చేసింది . ఈ కార్యక్రమం 2010 నాటికి సంతృప్తికరమైన నాణ్యత కలిగిన ప్రాథమిక విద్యను సార్వత్రికీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. సర్వశిక్ష అబియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తులు కీలకంగా ఉంటారు. వచ్చే నిధులు సక్రమంగా ఖర్చు చేయడానికి, పథకం సమర్థవంతంగా అమలు పరచడానికి నిష్ణాతులైన అనుభవజ్ఞులైన వారిని ఎంపిక చేయాలి కానీ ఇవన్నీ తుంగలో తొక్కి ఏమాత్రం అనుభవం లేని , గతంలో శాఖాపరమైన చర్యలు, మూడు సంవత్సరాలలో ఏకంగా 750 రోజులు సెలవుపై వెళ్లిన వారిని ఇంతవరకు వాళ్ళ ప్రొబేషన్ పూర్తి కాని జూనియర్ మోస్ట్ అనుభవం లేని వారిని అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గా నియమించారు. ఆమెకున్న ఏకైక అర్హత కులం. తన కులం వారు అధికారంలో ఉన్నారన్న ధీమా. ఈ నియామకంతో ఆగలేదు మన పాలనాధికారులు తీరు ఆమెకు అదనంగా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గా బాధ్యతలు వెలగ తీస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ డ్వామా కార్యాలయాలలో ఆమె చెప్పిందే వేదం ఆమె చేసేదే తీరు అన్న చందంగా మారింది. నిధులు వచ్చేది కేవలం రెండు విభాగాల్లోనే ఒకటి సమగ్ర శిక్షణ రెండోది డ్వామా. ఈ రెండు కార్యాలయాలలో పని గంటలలో ఎప్పుడు ప్రాజెక్ట్ అధికారి కనిపించరు. అటెండర్ ను అడిగితే మేడం అక్కడ ఉన్నారు అని సమాధానం తప్ప మేడం ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. గత పదిహేను నెలలు గా జరిగిన అవినీతి అంత ఇంత కాదు. ఇప్పుడు నియామకాలు తుంగలో తొక్కి తమకు నచ్చిన వారికి, తమ కులస్తులకు అందలమెక్కి స్తున్నారు. అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్ నియామక ఫైలు సమగ్ర శిక్ష ఏపిసి గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్ తప్పుదోవ పట్టించారు. దానికి నిదర్శనం ఇటీవల విద్యాశాఖ కమిషనర్ గారు ఇచ్చిన ప్రొసీడింగ్స్ నిదర్శనం కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ లో జీవో నెంబర్ 10 అమలు పరచమని ఇస్తే దానికి జిల్లా కలెక్టర్, ఏపీసి వక్రభాష్యం చెబుతూ అసిస్టెంట్ ఐఈడి నోటిఫికేషన్ కమిషనర్ గారికి రూల్స్ విరుద్ధంగా బడుగు బలహీన వర్గాలకు ద్రోహం చేసి అవినీతికి పాల్పడి దొంగ దారిలో స్టేట్ ఆఫీసుకు ఫైలు పంపిన విధానం రూల్స్ కు వ్యతిరేకంగా పంపించడం జరిగింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్, సమగ్ర శిక్ష ఏపీసి సంపాదనే ధ్యేయంగా పనిచేస్తూ రిజర్వేషన్ వర్గాల కోసం రిజర్వేషన్ వర్గాలకు వ్యతిరేకంగా పని చేసారు. కలెక్టర్ వినోద్ కుమార్ అనంతపూర్ జిల్లాలో పనిచేస్తున్న కాలమంతా దళిత బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ, వీరికి వ్యతిరేకంగా పనిచేస్తున్నటువంటి సమగ్ర శిక్ష ఏపిసి గారిని ప్రోత్సహిస్తూ రూల్స్ కు వ్యతిరేకంగా జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతులు లేకుండా దొంగ దారిలో స్టేట్ ఆఫీస్ కు ఫైలు పంపడం దారుణం. ఇలాంటి అధికారులను తక్షణమే పక్కన పెట్టి వీరు తీసుకున్న నిర్ణయాలపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలి. సమగ్ర శిక్ష అభియాన్ కు నిష్ణాతులైన అనుభవజ్ఞులైన వారిని అస్సిటెంట్ ప్రాజెక్ట్ ఆఫిసర్లు గా అలాగే డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గా సీనియర్ అధికారిని నియమిస్తే మంచిది. ఆలా కాకుండా ఏమాత్రం అనుభవం లేని ప్రొబేషన్ కూడా పూర్తికాని అలాగే మూడు సంవత్సరాలలో 750 రోజులు విధులకు గైర్హాజరైన వారిని కీలక పదవుల్లో కొనసాగిస్తే రాబోయే రోజుల్లో అనర్థాలను కొనితెచ్చుకున్నట్లే. నూతన జిల్లా కలెక్టర్ వీటిపై దృష్టి పెట్టాలని పలు ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

## కురుగొండలో ఘనంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్




ఓజిలి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: ప్రధానమంత్రి మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లి'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్'లి అవగాహన కార్యక్రమం ఆదివారం కురుగొండలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని కురుగొండ పి.ఏ.సి.ఎస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ దారా అంకయ్య ప్రత్యేక చొరవతో నిర్వహించారు. అంకయ్య మాట్లాడుతూ "మహిళల ఆరోగ్యం కాపాడినప్పుడే కుటుంబం సశక్తం అవుతుంది. ఈ పథకం మహిళలకు వరముగా నిలుస్తుంది. ఆరోగ్యవంతమైన మహిళే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. కాబట్టి మహిళలు ఈ సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైద్య బృందం మహిళలకు విస్తృతంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. లిబీపీ, షుగర్, అనీమియా, క్షయ వ్యాధి, సికిల్ సెల్ వ్యాధి, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులులి చేయడంతోపాటు అవసరమైన మందులు పంపిణీ చేశారు. అలాగే గైనకాలజిస్టులు, నేత్ర వైద్యులు, చర్మ వైద్యులు, మానసిక వైద్యులు, డెంటల్ వైద్యులు శిబిరంలో సేవలు అందించారు. యువతులకు, మహిళలకు తగిన కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలిలో భాగంగా ఇప్పటి వరకు కేంద్రం అనేక తల్లులకు లబ్ధి చేకూర్చిందని, ఈ పథకం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించడం లక్ష్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో లికురుగొండ సర్పంచ్ శ్రీలక్ష్మి, లిలిఓజిలి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమ బిందు, లిలిఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శేఖర్, లిలిసిహెచ్‌ఓ సుబ్బారామయ్యలి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొని వైద్యుల సూచనలను శ్రద్ధగా విన్నారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, తరచుగా ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు జరగాలని కోరుకున్నారు.

## శ్రీవారి పరకామణి వివాదంపై సీబీఐ విచారణ చేయాలి

**◆తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి**

తిరుపతి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: తిరుమల శ్రీవారి పరకామణి అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ఆరోపణల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది భక్తుల విశ్వాసం దెబ్బతింటోందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశం సిబిఐ విచారణ కోరుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి, భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి వేర్వేరుగా లేఖలు రాశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు లేకుండా పరకామణిలో దొంగతనం, దుర్విని యోగం జరిగిందని రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తోందని తన లేఖలో పేర్కొన్నారు. తిరుమల పరకామణి కేవలం నిధుల సమా హారం కాదని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక అని స్పష్టం చేశారు. ఇలాంటి పవిత్రమైన స్థలాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం భక్తుల విశ్వాసాలను దెబ్బతీస్తుందని, వారి నమ్మకం సడలిపోయేలా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం మత సామరస్యాన్ని, మతపరమైన సంస్థల పవిత్రతను కాపాడాలని స్పష్టం చేస్తోందని గుర్తు చేసిన ఎంపీ, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి మతాన్ని వాడుకోవడం సమాజంలో ఉద్రిక్తతలకు దారితీస్తుందని హెచ్చరిం చారు. ఈ పరిస్థితుల్లో నిజానిజాలను వెలుగులోకి తేవడానికి, భక్తుల విశ్వాసాన్ని కాపాడడం కేవలం సీబీఐ విచారణ ద్వారానే సాధ్యమని ఎంపీ గురుమూర్తి తెలిపారు. స్వతంత్ర సీబీఐ దర్యాప్తు ద్వారా తప్పుడు ఆరోపణలకు తెరపడుతుందని, తిరుమల పవిత్రత కాపాడబడుతుందని, కోట్లాది భక్తుల విశ్వాసం బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవిత్రమైన తిరుమల ఆలయం ఎప్పటికీ రాజకీయాల నుండి దూరంగా ఉండాలని, కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీ ఫిర్యాదు చేశారు.

## రేపు తిరుమలకు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ రాక

తిరుపతి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ రేపు ఎల్లుండి (బుధ, గురు వారంలో) తిరుమల శ్రీవారినీ దర్శించుకోనున్న సందర్భంగా ఏర్పాట్లు ను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, జెసి శుభం బన్సల్‌తో కలిసి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ముందస్తు భద్రత ఏర్పాట్లు లో భాగంగా జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ తిరుమల శ్రీవారినీ దర్శించుకోనున్న సందర్భంగా ఏర్పాట్లల్లో ఎలాంటి లోపాలకు తావివ్వరాదని తెలిపారు. సమావేశం అనంతరం రేణిగుంట విమానాశ్రయం నందు మందస్తు భద్రత లైజన్, భద్రత ఏర్పాట్లపై సమీక్షిస్తూ .. మెడికల్ క్యాంపు, అంబులెన్స్ ఏర్పాట్లు ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపుఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాష్ రెడ్డి,జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

### నాయుడుపేటలో దోమల బెడదపై
## మున్సిపాలిటీ చర్యలు



నాయుడుపేట, సూర్యవాస్తవం సెప్టెంబర్ 22: నాయుడుపేట పట్టణ పరిధిలో దోమల బెడద ఎక్కువవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా మున్సిపాలిటీ యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో మున్సిపల్ టీమ్ పట్టణంలోని ప్రధాన వీధులు, కాలనీలు, బస్తీల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ (స్ప్రే) కార్యక్రమాన్ని చేపట్టింది. మున్సిపల్ సిబ్బంది రాత్రి వేళల్లో దోమల నివారణ చర్యలను చేపడుతూ ప్రజలు ఆరోగ్య సమస్యల నుంచి బయటపడేలా కృషి చేస్తున్నారు. స్థానిక ప్రజలు మున్సిపాలిటీ తీసుకుంటున్న చర్యలకు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, నిల్వ నీరు, చెత్త కారణంగా దోమలు విస్తరిస్తున్నాయని అధికారులు గుర్తించారు. మున్సిపల్ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తను నిర్దిష్ట ప్రదేశాల్లో మాత్రమే వేయాలని, దోమల నివారణలో సహకరించాలని సూచించారు.

### సామాజిక సేవలో
## విశిష్టతకు గౌరవ డాక్టరేట్

**బల్లి కిరణ్‌కుమార్ కు రోటరీ క్లబ్ ఘన సన్మానం**



నాయుడుపేట, సూర్య వాస్తవం సెప్టెంబర్ 22: 108 అంబులెన్స్ లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ అనేక ప్రాణాలను కాపాడుతూ, సామాజిక సేవలో ప్రతిభ కనబరుస్తూ విశిష్టమైన సేవలు అందించిన బల్లి కిరణ్ కుమార్‌కు హర్యానా రాష్ట్రానికి చెందిన ఎం.బి.ఆర్ యూనివర్సిటీ 2025 సంవత్సరానికి గాను గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేసింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని నాయుడుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు ప్రముఖ పారిశ్రామికవేత్త పెసల జయరాజ గోపాల్, అధ్యక్షుడు ఆదవరం నాగురయ్య, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు బల్లి కిరణ్ కుమార్‌కు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. బల్లి కిరణ్ కుమార్ సమాజ సేవలో చూపుతున్న అంకితభావం ప్రశంసనీయం అని, ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా వచ్చిన ఈఅవార్డు నాయుడుపేటకు గర్వకారణమని వారు అభిప్రాయపడ్డారు.

## ఘనంగా పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు వేడుకలు



అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: అనంతపురం రమణ కొట్టాలలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షుడు యు .రమణా ఆధ్వర్యంలో పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షుడు యు. రమణ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... పరిటాల రవీంద్ర ముద్దుబిడ్డ యువ నేత పరిటాల శ్రీరామ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, మల్లికార్జున, నాగరాజు, కుంటన్న, రషీద్ అశోక్ నాయక్, మంజు, భాష, ఈరన్న, మనెమ్మ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్



లక్కిరెడ్డిపల్లి సెప్టెంబర్ 22 సూర్య వాస్తవం: ప్రభుత్వం 80% సబ్సిడీతో కిసాన్ డ్రోన్ ను రైతులకు అందిస్తుందని రైతులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి డాక్టర్ షఫీ నాయక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు కిసాన్ డ్రోన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని తుంపర సేద్యం, సబ్సిడీతో పనిముట్లు అందిస్తుందన్నారు. వీటివల్ల తక్కువతో నీటితో పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. డ్రోన్స్ కావాల్సిన ప్రతి రైతు వ్యవసాయ అధికారిని సంప్రదించాలని ఆయన తెలియజేశారు. బ్యాంకులు కూడా 80% సబ్సిడీతో డ్రోన్స్ పరికరాలు అందిస్తారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఏడిఏ జయరాన్ని, ఏవో రాజకుమారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## 370 గ్రాములు గంజాయి సీజ్ : ముగ్గురు అరెస్టు







రాయదుర్గం, సూర్య వాస్తవం: పట్టణంలోని గంజాయి శ్రీగంధం చెక్కల అక్రమ రవాణా, నేరపూరిత కుట్రను రాయదుర్గం సీఐ జయ నాయక బృందం చేదించింది. సీఐ జయ నాయక్ వివరాలు ఇలా.. జిల్లా ఎస్పీ జగదీష్, డీఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులకు విశ్వాసనీయ సమాచారం అందిన వెంటనే పట్టణంలోని ముద్రాసి అనిల్, ముద్రాసి హరికృష్ణ, ఒక మహిళ నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు సిఐ వివరించారు. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో గొల్ల అనిల్ ఇంటిముందు రా నిషేధిత పదార్థాలు ఉన్నాయని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా, ఈ ముగ్గురు అనుమానస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన వీరిని పట్టుకున్నట్లు సిఐ జయ నాయక్ తెలిపారు. గొల్ల అనిల్ కు ముత్రాశి హరికృష్ణకు మనస్పార్థాలు ఉండటంతో అనిల్ అనే వ్యక్తిని నేరపురిత కేసులో ఇరికించాలని, అనిల్ ను జైలుకు పంపాలని హరికృష్ణ కుట్ర పన్నారుఅని సిఐఅన్నారు. హరికృష్ణ మామ అయిన ముత్రాశి అనిల్ సహాయంతో సెట్టూరు మండలం చిన్నంపల్లి గ్రామంలోని శంకర్ వద్ద మూడు వేల రూపాయలు ఖరీదు చేసి అరకిలో గంజాయి కొనుగోలు చేశారన్నారు. శ్రీగంధం గంజాయి అనిల్ ఇంటి మెట్ల కింద దాచడానికి ప్రయత్నిస్తుండగా పక్కా సమాచారంతో వీరిని అరెస్టు చేసినట్లు జయ నాయక్ తెలిపారు. వీరి వద్దనుండి మోటార్ సైకిల్, ఒక వేట కొడవలి, గంజాయి శ్రీగంధం స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేసి, రాయదుర్గం కోర్టులో హాజరు పరిశీ 14 రోజులు రిమాండ్కు అనంతపురం జైలుకి పంపించారని సీఐ జయ నాయక్ బృందం ఒక ప్రకటనలో పేర్కొంది.

## శ్మశాన వాటికలను కబ్జాల నుంచి కాపాడాలి



గుత్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22 : గుత్తి పట్టణ పరిధిలో ఉన్న కర్నూలు రోడ్డు మోడల్ స్కూ ల్ ఎదురుగా గల స్మశాన వాటిక కబ్జాల గురి ఆయింది భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఈ యొక్క స్మశానానికి గు రించి గౌరవ ఎమ్మార్వో పుణ్యవతి కి విన్నతి పత్రం సమర్పించడం జరిగింది విషయమేమనగా సర్వే నం బర్ 548,687, గల సర్వే నం బర్లలో యొక్క స్మశాన వాటి క చాలా పురాతనమైనది ఈక్కడ కోళ్ల ఫారం కి సంబం ధించిన ఎస్సీ కమ్యూనిటీ వారు మరియు పట్టణంలో ఉన్నటువంటి బీసీ యాద వులకు సంబంధించిన ఈ స్మశాన వాటికను ఇక్కడే గ త కొద్ది కాలంగా మైనార్టీకి సంబంధించినటువంటి ఒక వ్యక్తి స్థలంలో ఇటికలు పోసుకుంటూ జీవనం చేసే వా డు ఇప్పుడు అతని కుమా రులు బిజెపి నాయకులుగా చలామణి అవుతున్నారు ఆ ముసుగులో దీన్ని ఒక ఏడు మందికి పట్టాలు ఇచ్చినారు అని కూడా వారు చెప్తున్నా రు వారు ఈ పట్టాలు ఏ ఎం ఆర్ ఓ ఇచ్చార లేక ఏ అధికారులు ఇచ్చారు అనేది కూ డా వెరిఫికేషన్ చేయాల్సిన అవసరం ఇప్పుడున్నటువంటి అధికారులు చెపాల్సి ఉంది అది గ్రామం మట్టంలో కూడా పంచాయితీ మ్యాపులో కూడా స్మశానంగానే చూ పబడుతుంది మరి హిందు వులకు సంబంధించిన ఈ స్మశాన వాటికని కబ్జాదారుల నుండి కాపాడి దానికి కాం పౌండ్ వాల్ కూడా ఏర్పాటు చేసి స్మశాన వాటికను కాపా డాలని సిపిఐ పార్టీగా డి మాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కా ర్యదర్శి రామదాసు,పట్టణ కార్యదర్శి రాజు యాదవ్, సహాయ కార్యదర్శి నజీర్, వెంకటేష్ దస్తగిరి శివ సీని యర్ నాయకులు డానియల్ గోపాల్ నాగార్జున తదిర్లు పాల్గొనడం జరిగింది.

# కూటమి ప్రభుత్వంలో జిల్లాకు అన్యాయం జరగనివ్వం

### ఆర్డీటీ సేవలు యధావిధిగా కొనసాగుతాయి - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: కూటమి ప్రభుత్వంలో అనంతపురం జిల్లాకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ విషయంలో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో.. మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్డీటీ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలు అందరికీ తెలిసిందేనన్నారు. కొన్ని లక్షల కుటుంబాలు ఈ సంస్థపై ఆధారపడ్డాయన్నారు. ఈ సంస్థకు ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ చేయకపోవడం వలన విదేశాల నుంచి వచ్చే విరాళాలు ఆగిపోతున్న విషయంపై అంతటా ఆందోళన ఉందన్నారు. దీనిపై తాము ఇప్పటికే మన రాష్ట్ర ఎంపీల ద్వారా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు హోం మంత్రి అమిత్ షాను కలిసి ఆర్డిటీ విషయాన్ని వివరించామన్నారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారన్నారు. అయితే తాజాగా దీనిపై ప్రజల్లో ఆందోళన పెరిగిపోతున్న నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ స్వయంగా కేంద్రంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఆర్డీటీ సంస్థ నిర్వాహకులు మాంఛో ఫెర్రర్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌తో సమావేశమయ్యారన్నారు. ఈ సందర్భంలో మంత్రి లోకేష్ స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ఆర్డీటీ సంస్థకు తాత్కాలిక పరిష్కారం కంటే శాశ్వత పరిష్కారం చూపే విధంగా కేంద్రంతో మాట్లాడుతున్నారన్నారు. ఈ విషయంలో మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చొరకు అనంతపురం నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఆర్డీటీ విషయంలో ?ఒక మంచి వార్త వింటారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆర్టీటీ సంస్థకు గాని, జిల్లా ప్రజలకు గాని ఇబ్బందికర పరిస్థితులు ఎప్పుడూ ఉండబోవని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ప్రజలు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు..

# జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: జిల్లాలో అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగ, సిబ్బంది అంకిత భావం కలిగి సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ, డిఆర్ఓ మలోలా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ అనంతపురంకు జిల్లా ఎంతో విశిష్టత ఉందని అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ స్పష్టం చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను పారదర్శకంగా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి సంబంధిత శాఖ అధికారులు సమయపాలన పాటించి నిర్ణీత సమయానికి హాజరుకావాలని ప్రతి అంశంలో సమయాన్ని పాటించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. 3 0 7 8 ఫీడ్ బ్యాక్ సరిగా నమోదు కాని పరిస్థితి సరైనది కాదన్నారు. చిన్న చిన్న విభాగాలకే అయిన సంబంధిత శాఖ అధికారులు అర్జీలను వ్యక్తిగతంగా పరిశీలించి అందులో ఉన్న విషయాలను గ్రహించి నాణ్యమైన పరిష్కార మార్గం ద్వారా సమస్యలను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలోఅత్యంతవెనుకబడిన జిల్లాలో ఒకటిగా నివేదికలు రావడం ఆందోళన కలిగించిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పి జి ఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి స్వీకరించే అర్జీలను మండల డివిజన్, స్థాయి అధికారులు కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ అర్జీలపై నిర్లక్ష్యాన్ని వీడి నిర్ణీత సమయంలో సమస్యలను పూర్తి చేయాలన్నారు. ప్రధాన కేంద్రంతో పాటు క్షేత్రస్థాయి లో ని అన్ని శాఖ అధికారులు బాధ్యతగా పనిచేసే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పునరుద్ఘాటించారు. మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని స్టాట్యూటరీ మీటింగ్ సోమవారం నాటికి ముగిసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతివారం ఆర్డీవోలు ,డిపిఓలు, డీఏవోలు గ్రీవెన్స్ రీ డ్రెస్ ల్ పై తప్పనిసరిగా ఆడిట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ ,పోలీస్, సర్వే శాఖలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నందున వీటిని పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. ఆర్డీవోలు ప్రతి రెండు రోజులకు ఒకసారి ఇపిటిఎస్ పనులను ప్రత్యేకంగా మానిటరింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత కాంట్రాక్టర్లకే కాక ఆపరేటర్లు కూడా బాధ్యత తీసుకొని పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమైన కోర్టు కేసులు ముందుగానే తనతోచర్చించిహాజరుకావాలని తెలిపారు. దీనికి సంబంధించి సమగ్ర నివేదికలను సిద్ధం చేసి తన వద్దకు తీసుకురావాలని తెలిపారు. పైళ్లను సరైన రీతిలో ప్రత్యుత్తరాలు చేసి ఈ ఆఫీస్ ద్వారా పంపాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ అందే విధంగా కృషి చేయాలని అన్నారు. అలాగే ఐసిడిఎస్, వైద్య ఆరోగ్యశాఖ, డి ఆర్ డి ఏ, పరిశ్రమల శాఖ మెప్మా, తదితర శాఖలలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై విజయగాథలను సేకరించాలని దీనిపై కూడా ప్రజల్లోకి వెళ్లి ఫలితాలను ఆయా శాఖల ద్వారా విస్తృతపరచాలని కలెక్టర్ సూచించారు. సోషల్ మీడియాలో కూడా ఈ కార్యక్రమాలకు విస్తృతంగా ప్రచారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ రామకృష్ణారెడ్డి, ఎస్ డి సీలు ఆనంద్, మల్లికార్జున, తిప్పే నాయక్, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ వివిధ శాఖలకు చెందిన అధికారులు అర్జీదారుడు తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం పోలీస్ గ్రీవెన్స్‌కు 110 వినతులు





అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: అనంతపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాడు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్ పాల్గొన్నారు. జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజల నుండీ 110 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చట్టపరంగా పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఫిర్యాదులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని..నిర్దేశిత గడువు లోపే ఫిర్యాదులకు పరిష్కారం చూపించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో, పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రజల సమస్యలపై పోలీస్ విభాగం బాధ్యతగా స్పందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు మహిళా విభాగం డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గుత్తి మున్సిపాలిటీలో లోక్ కళ్యాణ్ మేళాలతో మెడికల్ క్యాంప్




గుత్తి సూర్య వాస్తవం సెప్టెంబర్ 22: గుత్తి అర్బన్ భారత ప్రభుత్వం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం – మెప్మా ఆదేశాల మే రకు కమీషనర్ బి.జబ్బార్ మియా ఆధ్వర్యంలో పి.యం స్వ నిది లబ్ధిదారులకు లోక్ కళ్యాణ్ మేళాలు సెప్టెంబర్ 17,2025 నుండి అక్టోబరు 2 ,2025 వరకు నిర్వహిస్తున్నామని కమీషనర్ బి.జబ్బార్ మియా ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు అన్ని విధాల సహకారంగా మొ దటి విడత 15000,రెండవ విడ త 25000 మరియు 3వ విడత 50000 వరకు లబ్ది చేకూరే పి. యం.స్వనిధి పథకం ద్వారా లబ్ది పొంది వ్యాపార అభివృద్ధి చేసు కుని సామాజికంగా,ఆర్థిక పరంగా మహిళలు నిలదొక్కుకునే ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకు నేందుకు బ్యాంకుల ద్వారా లోను మంజూరు చేయించి వ్యాపారా లను అభివృద్ధి చేసుకుంటున్న లబ్ధిదారులకు ఈరోజు మున్సిపల్ ఆఫీసు యందు కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రత్యేక ఆరోగ్య శి బిరాలను ఏర్పాటు చేసి వారికి, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేయడం జరిగినది. ఈ ఆరోగ్య శిబిరం లో పాల్గొన్న ల బ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. లబ్ధిదారులకు సూచనలుగా తమ వ్యాపార అభివృద్ధి కి దోహదపడేలా లెండిం గ్ సంస్థలు,డిజిటల్ చెల్లింపులు, టౌన్ వెండిగ్ కమిటీ,ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా,లైన్ మినిస్ట్రీస్ డిపార్ట్మెంట్ ల ద్వారా వీధి విక్రయ దారులకు సమగ్ర మద్దతు ప ర్యావరణ వ్యవస్థను సృష్టించేలా ఈ కార్యక్రమాలను మెప్మా అధి కారులు,సిబ్బంది సహకారంతో చేపడుతున్నామని కమీషనర్ బి.జబ్బార్ మియా తెలియజేశా రు.ప్రభుత్వ హాస్పిటల్ అధికారు లు, సచివాలయ హెల్త్ సెక్రెటరీ లు,పట్టణ స్ట్రీట్ వెండింగ్ కమిటీ వారు,ఆశా వర్కర్ల సహకారంతో ఈరోజు మెగా ఆరోగ్య శిబిరం వి జయవంతం అయినది తెలిపారు.కావున ప్రభుత్వాలు అంది స్తున్న చిరు వ్యాపార అభివృద్ధి బ్యాంకు లోను అయిన పి.యం. స్వనిది లోను పొంది తమ వ్యా పార అభివృద్ధికి ఆర్థిక,డిజిటల్ లిటరసీ మరియు సామాజిక మ హిళా సాధికారత సాధించేందుకు ఈ పథకమును వ్యాపారం సాగి స్తున్న ప్రతి చిరు వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈ ప్రకటన ద్వారా కమీషనర్ బి.జ బ్బార్ మియా తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, సిబ్బంది,ఆర్.పి లు,పట్టణ సమా ఖ్య ప్రతినిధులు,సమాఖ్య ప్రతి నిధులు,పి.యం.స్వనిది లబ్ధిదా రులు,మహిళా సంఘాల ప్రతి నిధులు,సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం జరిగినది.

## బాధితులకు సత్వర న్యాయం అందించాలి

**పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**





అన్నమయ్య బ్యూరో సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: ప్రజల సమస్యలు వినడం, వాటికి తక్షణ పరిష్కారం చూపించడం అన్నది పోలీస్ వ్యవస్థలో అత్యంత ప్రధానమైన బాధ్యత అని జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్., స్పష్టం చేశారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ గారు స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు విన్నవించుకునే హక్కు అందరికీ ఉందని ఎస్పీ స్పష్టం చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు వంటి వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్జీదారులు జిల్లా కేంద్రానికి రాలేనివారు, తమ సమీప పోలీస్ స్టేషన్, సర్కిల్ లేదా సబ్ డివిజన్ కార్యాలయంలో అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు నిర్ణీత గడువులో పరిష్కరించాలని, బాధితులకు న్యాయం ఆలస్యమవకూడదని స్పష్టంగా ఆదేశించారు.

Truth of News
సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in



## మొక్కలను విరివిగా పెంచాలి : కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలను నాటి వాటిని చెట్లుగా ఎదిగేంత వరకు దత్తత తీసు కోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు అటవీశాఖ వన విభాగం అధికారులు కలెక్టర్, జేసీలకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన జిల్లాలో చేపట్టినందుకు మొక్కల పెంపకంపై కలెక్టర్ కు వివరించారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్లాంటింగ్ సీజన్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, అనధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, పౌరులు ఒక కోటి మొక్కలను విరివిగా నాటి వాటిని చెట్లుగా ఎదిగేంత వరకు దత్తత తీసు కోవాలని పిలుపునిచ్చారు. దీని కొరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సామాజిక వన విభాగం ఆధ్వర్యంలోని 15 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచడమైనది. అదనంగా ఇతర ప్రదేశాల నుండి ఈ ప్రాంతానికి అనుకూలమైన స్థానిక ప్రజలకు కావలసిన మొక్కలను ఇతర ప్రదేశాల నుండి కూడా తెప్పించు కొనుటకు మౌఖిక అనుమతులను ఇవ్వడం జరిగిందని అన్నారు. కావున జిల్లాలోని రైతులు, ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వ శాఖల అధికారులు, అనధికారులు, ఎన్జీవోలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీలు మొదలగువారు వారి వారి వ్యక్తిగత మరియు సామాజిక ప్రదేశాలలో నాటడానికి కావలసిన మొక్కల వివరాలను శ్రీ సత్యసాయి జిల్లా సామాజిక వనవిభాగం డివిజనల్ అటవీ శాఖ అధికారి వారికి వెంటనే తెలపాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ఇప్పుడు అందుబాటులో ఉన్న 15 లక్షల మొక్కలను అక్టోబర్ రెండో తేదీ నాటికి నాటాలన్నారు,ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి సోషల్ ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులు, అధికారులు ఇన్చార్జి డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళలకు 10 వేలు ఆర్థిక సహాయం



సిద్దవటం, సూర్యవాస్తవం సెప్టెంబర్ 22: పొన్నవోలు కొత్తపల్లి దళితవాడలో నివసిస్తున్న దళిత మహిళలు తమకు పనులు లేవని ఆర్థిక సహాయం అందించాలని కోరడంతో సోమవారం మాజీ సర్పంచ్ కుమారుడు అంకాలు రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దళితవాడలోని చేతి పంపు మరమ్మత్తులకు గురైందని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతి పంపును మరమ్మత్తులు చేయిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు. తమ గ్రామ పంచాయతీలోని ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## గోరంట్ల ఎంపీడీవోగా కమల బాయి బాధ్యతల స్వీకరణ



గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: గోరంట్ల మండలం నూతన రెగ్యులర్ ఎంపీడీవో గా ఎస్ .కమల బాయి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో గా పని చేస్తున్న నరేంద్ర కుమార్ డోన్ డిడిఓ గా పదోన్నతి పై బదిలీ కావడంతో ఆయన స్థానంలో పెనుకొండ ఎంపీడీఓ నరేష్ కృష్ణను ఇన్చార్జిగా కొద్ది రోజులు బాధ్యతలు అప్పగించారు. అయితే పెనుకొండ డిప్యూటీ ఎంపీడీవో గా పని చేస్తున్న ఎస్ కమలా బాయి పదోన్నతిపై గోరంట్లకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు, దీంతో ఆమె బాధ్యతలు చేపట్టారు.

## జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన ఏఎస్ఐలు



పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: 1993 మరియు 1995 బ్యాచ్ కు చెందిన 10,మంది హెడ్ కానిస్టేబుల్ కు ఏ ఎస్ ఐ లు గా పదోన్నత కల్పించారు,వీరందరూ సోమవారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్ లో జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎస్సీ ఎస్టీలపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

◆జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎమ్మార్పీస్ నాయకులు రమణ



అనంతపురం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: ఏపీ ఎమ్మార్పీస్ నాయకులు యు . రమణ ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ ను ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ఎస్టీ దళిత సమస్యల పైన ప్రత్యేక శ్రద్ధ చూపించాలని. జిల్లాలో దళితుల భూముల అగ్రవర్ణాల చేతిలోకి తీసుకొని దళితుల్ని ఇబ్బందులు పెడుతున్న వారి పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నారాయణ స్వామి, రాష్ట్రప్రధాన చిన్న పెద్దన్న సత్యమయ్య. కుంటిమద్ది ఓబులేసు. గుంతకల్లు మల్లేష్. టిడిపి ఎస్సీ అధ్యక్షులు. టీ.రాము ఎమ్మార్పీఎస్ నాయకులు. లక్ష్మీనారాయణ కొరపాడు. లక్ష్మీపతి. వెంకటేష్. మరుట్ల అమర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

◆జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్





అన్నమయ్య బ్యూరో సూర్య వాస్తవం సెప్టెంబర్ 22: పిజిఆర్ఎస్ అర్జీలను సకాలంలో, నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడంజరుగుతోందన్నారు. ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన జాయింట్ కలెక్టర్ ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జాయింట్ కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు**

రాయచోటి మండలం పెమ్మాడపల్లి గ్రామం పంచాయతీ పరిధిలోని గరుగుపల్లికు చెందిన ఉండు పల్లపు చిన్నిమ్మి ఇల్లు మంజూరు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. వీరపల్లి మండలం, గుర్రప్ప గారి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చమర్తి వాండ్లపల్లి కు చెందిన చమర్తి వెంకటసుబ్బమ్మ నా వయస్సు 72 సంవత్సరాలని నా భర్త తేదీ 25.12.2021 న మరణించడం జరిగిందని నాకు ఎలాంటి జీవనాధారం లేదని నాకు వితంతు లేదా వృద్ధాప్య పెన్షన్ ఇప్పించవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు విన్నవించుకున్నారు. చిన్నమండెం మండలం ఎర్ర గట్ల వాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని వండాడి కి చెందిన జి. చంద్రమోహన్ వృద్ధాప్య పెన్షన్ ఇప్పించవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అర్జీలు సమర్పించారు. సదరు సమస్యలన్నింటిని నిర్ణీత గడువుగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్,జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించండి

◆జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నిరసన




అన్నమయ్య బ్యూరో సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన మెడికల్ కళాశాలల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ష షిప్ (పీపీపీ) విధానాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని,. ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య ప్రజారోగ్యం కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా వైద్య విద్యను (పిపిపి) పద్ధతిలో నిర్వహించాలని కూటమి ప్రభుత్వం తీసుకుందని ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు . విలువైన ప్రజాధనాన్ని ప్రైవేట్ వారికి అతి చౌకగా కట్టబెట్టే పిసిపి విధానం వైద్యరంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించడంలో భాగమని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన కళాశాలలను ప్రైవేట్వరం చేయడం దారుణమని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం పిపిపి విధానానికి కొత్త భాష్యం చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రైవేట్ వారికి అప్పగించడం లేదని, ప్రభుత్వ రంగంలోనే ఉంటుందని, కేవలం నిర్మాణాలు మాత్రమే ప్రైవేట్ చేస్తోందని చెప్పి సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీల భవనాల నిర్మాణాలను కొంతవరకు పూర్తి చేసిందని, వాటిని చూపకుండా ఖాళీ స్థలాలను చూపిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కళాశాలల ప్రవేటీకరణకు జారీ చేసిన పిపిపి నోటిఫికేషన్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్యను ప్రభావితం చేసే ఏ విధమైన మార్పులనైనా చేపట్టే ముందు పౌర సమాజం, నిపుణులు, భాగస్వాములతో సంప్రదింపులు జరపాలన్నారు. ప్రైవేటు సంస్థలు లాభం కోసం మాత్రమే పని చేస్తాయని, మానవత, సేవా దృక్పథం తక్కువ అని అన్నారు. ఇప్పటికే ఉన్న ప్రైవేటు వైద్య కళాశాలల్లో సీటు రూ. కోటికి పైగా చేరుకుందన్నారు. సంపన్నులకు మాత్రమే వైద్య విద్య అందుబాటులో ఉంటుందన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలు, మహిళలు, వికలాంగులకు, ఆర్థికంగా బలహీన వర్గాలకు రిజర్వేషన్ల అమలుకు ఇబ్బంది నెలకొంటుందన్నారు. వైద్య సేవల్లో ఇప్పటికే ప్ర తీవ్రమైన కొరతతో సతమతమవుతున్న రాష్ట్రానికి వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చర్య అసమానతలను మరింత పెంచుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీం భాషా, వేణు గోపాల్ రెడ్డి,ముభారక్,నర్సింహులు,తిరుమల,దేవా పాల్గొన్నారు.

# మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు శక్తివంతం





కనేకల్, సెప్టెంబర్ 22 సూర్య వాస్తవం : నేషనల్ హెల్త్ మిషన్ లో భాగంగా మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కనేకల్ పట్టణంలోని మొదటి మరియు రెండవ సచివాలయంలో డాక్టర్ మల్లేశ్వరి మరియు డాక్టర్ సౌందర్య ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. పదిహేను రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లీశ్వరి మరియు డాక్టర్ సౌందర్య మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని అన్నారు మరియు మహిళల ఆరోగ్య రక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్క మహిళ క్యాంపులకు వచ్చి పరీక్షలు చేయించుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క మహిళ ఆరోగ్య భద్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యం గురించి అవగాహన కల్పించమన్నారు. మహిళలకు పోషకాహార సలహాలు, గుండె జబ్బులు, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ,నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు మరికొన్ని వైద్య సేవలు అందించినట్లుగా డాక్టర్లు తెలిపారు.మహిళల ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా చిన్నపాటి అనుమానాలు ఉన్న వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.శిబిరంలో గ్రామ ప్రజలకు బీపీ, డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి, వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులు అందజేశారు. రక్తహీనత సమస్యతో బాధపడుతున్న మహిళలు, కిశోర బాలికలకు హీమోగ్లోబిన్ పరీక్షలు చేసి, రక్తహీనత ఉన్నవారికి అవసరమైన మందులు అందజేశారు. గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించి, గర్భధారణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సరైన పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే వారికి ఎం.సి.పీ కార్డులు అందజేశారు.ఇక పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. యుక్తవయసు బాలికలు, మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ సౌందర్య, ఎంపిహెచ్ఈఓ తిరుపల్ నాయక్, ఎంపిహెచ్(ఎ) మురళీకృష్ణ, ఎంపీహెస్ నరసింహులు, ఎమ్ఎల్హెచ్పిలు వెన్నెల , యమునా బాయ్, సౌమ్య, ఆఫ్రిన్, ఆశ వర్కర్లు సుజాత, ముత్యాలమ్మ, స్వాతి, వన్నూరమ్మ, రూప, ఆశా, సుధా, జయలక్ష్మి, రాధా , అంగన్వాడీ టీచర్లు శాంతమ్మ ,హసీనా, రజియా, స్వర్ణ, రాధిక, గాయత్రి, లత మరియు మహిళలు, బాలింతలు పాల్గొన్నారు.

# మోదీ, నిర్మలా సీతారామన్‌లకు ధన్యవాదాలు



పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: భారతీయ జనతా పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు జివిఎం శేఖర్ జిల్లా కార్యాలయంలో దసరా, దీపావళి కానుకగా భారత దేశ ప్రజలకు జీఎస్టీ పనులు తగ్గించడంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారాం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "మోదీ అంటే మేలు ప్రజల కోసం ప్రతి అడుగు" "జీఎస్టీ 2.0 – పారదర్శక భారత్, అభివృద్ధి భారత్" ప్రజల శ్రేయస్సు కోసం, దేశ ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మరో చారిత్రాత్మక నిర్ణయం జీఎస్టీ 2.0. దీని ద్వారా ప్రజలకు నేరుగా లాభం కలిగే విధంగా పన్నులు తగ్గించడం హర్షించదగ్గ విషయం అన్నారు, జీఎస్టీ 2.0లో పన్నుల తగ్గింపు ద్వారా ప్రజలకు అవసరమైన రోజువారీ సరుకులు అంటే ఆహార పదార్థాలు, పాలు, పప్పులు, గోధుమ, బియ్యం మొదలగు సరుకుల పై పన్ను పూర్తిగా తొలగించి అనగా పన్ను లేకుండా చేయడం ద్వారా ప్రజల కోసం.. ప్రజలతో.. ప్రజల అభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వం అని దేశ ప్రజలకు తెలియజేశారు. మధ్య తరహా వస్తువులు అనగా కిచెన్ ఉపకరణాలు, విద్యుత్ పరికరాలు మొదలగు వస్తువులపై జీఎస్టీ 12% నుంచి 5%కు తగ్గించడం జరిగింది. చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి వర్గం కోసం కంపౌండ్ జీఎస్టీ పరిమితిని పెంచి పన్ను భారం తగ్గించారని, ప్రజా రవాణా, హెల్త్‌కేర్, విద్యా సేవలు పై పన్ను తగ్గించడం ద్వారా సామాన్య ప్రజలకు ఉపశమనం లభించినట్లేందని, డిజిటల్ ట్రాన్సాక్షన్లు ప్రోత్సహించేందుకు కొన్ని ఫీజులు, సర్వీస్ పన్నులు తొలగించడం జరిగిందని తెలిపారు. జీఎస్టీ2.0ద్వారా ప్రజలకు జరిగే ప్రయోజనాలు చిన్న వ్యాపారాలు బలపడతాయని, వినియోగదారులకు సరుకులు మరింతచౌకగా లభిస్తాయి. పన్ను వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లభిస్తుందని తెలియజేశారు. "ప్రజల కోసమే ప్రజల అభివృద్ధి కోసం" అనే ధ్యేయంతో తీసుకున్న ఈ సంస్కరణ మోదీ ప్రభుత్వ దూరదృష్టి, నిర్మలా సీతారామన్ కృషికి నిదర్శనమని తెలియజేశారు. శ్రీ సత్య సాయి జిల్లా తరఫున, భారత దేశ ప్రజల తరపున నరేంద్ర మోడీ కి నిర్మల సీతారాంకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సునీల్ వైట్ల ఎల్వి రమేష్ బాబు సీనియర్ నాయకులు కొండమరాజు బాలగంగాధర్ జిల్లా కోశాధికారి సురేంద్రబాబు, మహిళా మోర్చా నాయకురాలు లక్ష్మి అపర్ణ ,ఐటీ సెల్ కన్వీనర్ భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సోకే రామాంజనేయులు, పుట్టపర్తి రూరల్ బుక్కపట్నం మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మహ్మద్ రఫీ మహానంద పట్టణ ప్రధాన కార్యదర్శి నారాయణ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా గ్రంథాలయాలను

# డిజిటలైజేషన్ చేసే అవకాశం ప్రభుత్వానికి ఉందా?

**ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పటిలోగా భర్తీ చేస్తారు? - అసెంబ్లీలో ప్రస్తావించిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి**



పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: గ్రంథాలయాలు దేవాలయాలు విద్యాలయాలు మానవ జీవిత మునుగడకు ప్రతిరూపాలు, ఆనాటి ప్రముఖ కవి విద్య సంస్కర్త రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం చెప్పిన ఒక మాటను ఉదాహరణంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధి వాటిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర అమరావతి రాజధానిలో ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీలో గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేకంగా మాట్లాడుతూ గాలి నీరు లేక బ్రతకవచ్చునేమో గ్రాసమును లేక ఎట్లెట్లో గడపవచ్చునేమో.. గడపవచ్చునే ఒక గడియ నైన గ్రంథము లేని గ్రామం నందు....అని ఆనాటి కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు చెప్పిన మాటలను , గాలి నీరు ఆహారం లేకపోయినా ఎలాగో బతకవచ్చు గ్రంథాలయాలు లేని గ్రామాలలో బతకడం కష్టమని ప్రముఖ మహా కవి చెప్పిన మాటలను వివరిస్తూ ఈ సందర్భంగా అసెంబ్లీ లో ఎమ్మెల్యే పల్లె సింధూర ప్రత్యేకంగా గ్రంథాలయాల సమస్యలపై ప్రధానంగా ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల్లో పనిచేసే సిబ్బంది జీతాలకు తగినంత గ్రాంటు ఇవ్వకపోవడం వల్ల స్థానిక సంస్థల నుంచి వచ్చే గ్రంథాలయ సెస్ ఆదాయాన్ని గ్రంథాలయాల నిర్వహణ కోసం కేటాయించాల్సి ఉంది కానీ చాలా చోట్ల స్థానిక సంస్థలు ఈ నిధులను వేరే అవసరాలకు వాడుకుంటూ గ్రంథాలయాలకు చెల్లించకుండా బకాయిలు పెడుతున్నారు. దీనివల్ల గ్రంథాలయాల అభివృద్ధి ఆగిపోవడం, తత్ఫలితంగా కొత్త పుస్తకాల కొనుగోలు లేకపోవడం ,నూతన గ్రంథాలయాల నిర్మాణం చేసుకోవడం వాస్తవమేనా అని రాష్ట్ర ప్రభుత్వంద్వారా రాష్ట్రవిద్యాశాఖ మంత్రిని కోరుతున్నాను. అదేవిధంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఉన్న గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసే అవకాశం ప్రభుత్వానికి ఏమైనా ఉందా అని అడిగారు. గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయడం వల్ల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండి వారికి అన్నివిధాలుగా ఉపయోగపడే విధంగా పుస్తకాలు అందుబాటులో లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వీటిని గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తే అందులో ఉన్న విజ్ఞానాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటి లాగిన్ ,పాస్వర్డ్ లను లైబ్రరీలకు వచ్చే వారికి అందజేయడం వల్ల ఎంతో ఉపయోగకరంగా , సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు. అదేవిధంగా రాష్ట్రంలో ఈ గ్రంథాలయాల్లో రెండు వేల పైచిలుకు పైగా లైబ్రరియన్లు, వాచ్మెన్లు రికార్డు అసిస్టెంట్లు పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయని వీటిని భర్తీ చేసే అవకాశం ప్రభుత్వానికి ఉందా? అని సంబంధిత శాఖ మంత్రిని ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి కోరారు,గ్రంథాలయాల్లో ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే డీఎస్సీ గ్రూప్ 1 గ్రూప్ 2, సివిల్ ,రైల్వే ,పోస్టల్ ఇతర పోస్టుల వంటి పోటీ పరీక్షలకే కాకుండా వివిధ బ్యాంకు కోచింగ్ వంటి వాటికి ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులకు అవసరమయ్యే పుస్తకాలను ప్రభుత్వం ధర ఏర్పాటుచేసే అవకాశం ఉందా అని అడిగారు? ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయాల్లో ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చి వీటిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే సంబంధిత రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును ప్రత్యేకంగా కోరారు, అంతేకాకుండా నేటి యువతరంలో రోజురోజుకు తగ్గిపోతున్న నైతిక విలువలను పెంపొందించడానికి అన్ని గ్రంథాలయాల్లో రామాయణం, మహాభారతం, భాగవతం, పంచతంత్రం, పెద్ద బాలశిక్ష, సుమతీ శతకాలు, వేమన పద్యాలు వంటి నీతి పుస్తకాలు ఏర్పాటుచేస్తే ఇప్పటి యువతరానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. అదేవిధంగా మేజర్ పంచాయతీల్లో బుక్ డిపాజిట్ సెంటర్ చేసే బదులుగా మినీ లైబ్రరీలు ఏర్పాటు చేసే అవకాశాలు ప్రభుత్వానికి ఏమైనా ఉన్నాయా అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి వీటిపై తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి సమాధానమిచ్చారు.

# న్యాయం చేయాలని సవితమ్మని కోరిన సెడ్స్ మాజీ ఉద్యోగులు



పెనుకొండ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: తాడేపల్లి బిసి సంక్షేమ శాఖా మంత్రి క్యాంప్ కార్యాలయంలో సెడ్స్ మాజీ ఉద్యోగులు పెనుకొండ ఎమ్మెల్యే, బిసి సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ ని కలసి వినతిపత్రం అందజేశారు. సోషియల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ (సెడ్స్), ఆనందపురం, సోమందేపల్లి మండలంనందు 20నుండి 30 సంవత్సరాలుగా పనిచేయడం జరిగిందని, సంస్థ యందు పనిచేస్తున్నప్పుడు ఉద్యోగుల అభివృద్ధి కొరకు "స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్" బ్యాంక్ ఖాతా (ఎస్ బి ఏ సి, 11139087990), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పెనుకొండ నందు తెరచి, ప్రతినెల స్టాఫ్ కాంట్రిబ్యూషన్ మొదలైన ఆదాయ వనరులను ఆ బ్యాంకు ఖాతాలో జమ చేయడం పరిపాటి. సంస్థ అధ్యకులు రాజెన్ జాషువా 'స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్" బ్యాంకు ఖాతా నుండి డబ్బులు విత్ డ్రా చేసుకొని తన పేరుమీద తొమ్మిది ఇంటి స్థలాలు సర్వే నెంబర్, 671, మడకశిర రోడ్డు, పెనుకొండ నందు (డాక్యుమెంట్ నెంబర్: 2336/2004 - 0.10 సెంట్లు, 2337/2004 - 0.20 సెంట్లు) రిజిస్టర్ చేసుకొన్నారని తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ ఒరిజినల్ పత్రాలు మాకు ఇచ్చి, తరువాత మాకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పారు. ఇదే విషయాన్ని సెడ్స లెటర్ పాడ్ మీద ఒక లెటర్ తయారుచేసి అందులో 20 సంవత్సరాల పైబడిన ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇస్తామని హామీగా మాకు ఆ లెటర్ యొక్క నకలు కాపీ ఇవ్వడం జరిగింది. ఇదివరకే మేము చాలా సార్లు ఈ ఇంటి స్థలాలు మాకు ఇవ్వమని అడగడం జరిగింది, కానీ దాన్ని దాటవేస్తూ కాలయాపన చేసారు. ఇప్పుడు మాకు మోసం చేసి సంస్థ సి.ఇ.ఒ మానిల్ జాషువ ఆ ఇంటి స్థలాలు అమ్మకమునకు పెట్టారని తెలిసి లాయర్ నోటీసులు పంపించాము, లాయర్ నోటీసులకు ఇంతవరకు బదులు లేదు. సెడ్స్ సంస్థ అధ్యక్షులు రాజెన్ జాషువకు రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం అయి, ఎవరిని గుర్తు పట్టే పరిస్థితికి వచ్చారు. ఆ సమయంలో సి.ఇ. ఒ మానిల్ జాషువ తన కుమారుడు రోహిత్ జాషువ, కుమార్తె రాష్నా లీలాని జాషువ పేరు మీద ధర్మవరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 25-01-2018 వ తేదీన దాన విక్రయం చేశారు. మాకు మోసం చేసిన సంస్థ నుండి మాకు తగిన న్యాయము చేసి మా ఇంటి స్థలాలు మాకు ఇప్పించవలెనని పెనుకొండ ఎమ్మెల్యే, బిసి సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మని కోరారు. దానికి పెనుకొండ ఎమ్మెల్యే, బిసి సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ స్పందించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో సెడ్స్ మాజీ ఉద్యోగులు సాయి ప్రసాద్, వెంకట స్వామి, రమణమ్మ, సునీత, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కోసం సంసిద్ధత కావాలి: కలెక్టర్ శ్యాం ప్రసాద్



పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడం లో భగంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహక రించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)సమావేశం నిర్వహించారు. (ఇంతకు మునుపు 2002 వ సంవత్సరంలో జరిగినది.) ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నందు ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడం గురించి అన్ని రాజకీయ పార్టీల నుండి అభ్యంతరాలు మరియు సూచనలు తెలుప వలసినదిగా కోరారు. ఈ నేపథ్యం లో రాజకీయ పార్టీలు ప్రతినిధులు తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18-19 వయసుగల యువత ఓటు నమోదు వంటి అంశాలపై తమ సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు, రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి వాటి జాబితాలను వెంటనే సంబంధిత నియోజకవర్గ ఎన్నికల అధికారికి సమర్పించవలసినదిగా ఆదేశించియున్నారు. సుమారు 23సంవత్సరముల తరువాత ఎన్నికల సంఘం వారు తిరిగి ఇప్పుడు నిర్వహించ తలపెట్టినరు దానికి సంబంధించి ముందస్తు కార్యక్రమాలు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని సూచించినారు. ఈ కార్యక్రమం నందు బి ఎల్ ఓ లు ఇంటింటికీ తిరిగి కొత్త వోటర్ల జాబితాను తయారు చేస్తారని అన్నారు. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం చాలా పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల సంఘం వారి ఆదేశములు ఇచ్చారన్నారు, ఈ సమావేశంలో ఇంచార్జ్ డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ ఎమ్మార్వో జాకీర్ హుస్సేన్, టిడిపి పార్టీ ప్రతినిధులు ఎస్. ఆదినారాయణ, బిజెపి ఎన్. కళ్యాణ్ కుమార్, కాంగ్రెస్ కె. లక్ష్మీ నారయణ, సీపీఐ (ఎం) గంగాద్రి , వైఎస్సార్ సి పి రవి నాయక్, జనసేన అబ్దుల్లా మరియు జి. సతీష్ కుమార్, ఇతర ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో ఆమరణ దీక్ష చేస్తా

**◆రాష్ట్ర కాపు జేఏసీ అ ధ్యక్షులు చందు జనార్దన్**



గుత్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: గుత్తి పట్టణంలోని బలిజ కా పు వర్గాల సమస్యల పరి ష్కారం కోసం రాష్ట్ర కాపు జే ఏసీ దశల వారి ఉద్యమం కొ నసాగిస్తుందని రాష్ట్ర కాపు జేఏసీ ప్రకటించింది.గిరి బలి జ జీ ఓ ను నిరసిస్తూ రాయ ల సీమ పర్యటన లో భాగం గా రాష్ట్ర కాపు జేఏసీ అధ్య క్షులు చందు జనార్దన్ అనం తపురం జిల్లా గుత్తిలో సోమ వారం ఓ కార్యక్రమం లో పా ల్గొన్నారు.గుత్తిలో బలిజ సంఘాల నాయకులతో కల సి సమావేశం ఐ భవిష్యత్తు ప్రణాళిక పై చర్చించారు.ఈ సందర్భం గా మీడియా తో మాట్లాడుతు కూటమి ప్రభు త్వ బలిజ కాపు వర్గాలపై కక్ష పూరిత ధోరణి విధానడాలని గిరి బలిజ జీ ఓ ను రద్దు చే యాలనీ గిరి బలిజలో బలి జ తొలగించాలని చందు జ నార్దన్ డిమాండ్ చేసారు. దొ మ్మారులను గౌరవించడాన్ని బలిజ వర్గాలు స్వాగతిస్థా యి.కానీ బలిజలో కలపదా న్ని విభేదిస్తాము.గిరి బలిజ ప్రభుత్వ వైఖరిబలిజల పై దాడి గానే రాష్ట్ర కాపు జేఏ సీ భావిస్తుంది.జనసేన అధి నేత ఎన్నికల ముందు బలిజ కాపు వర్గాలు పెద్దన్న పాత్ర పోషించాలని యస్ సి,యస్టీ,బిసి,మైనారిటీ వర్గాలను కలుపు కొని ముందు కెల్లాల ని ఆదేశించారు కులం పా టించింది.రాష్టం లో అధికార మార్పిడి కావాలని పవన్ అన్నారు.బలిజ కాపులు మార్పిడి తెచ్చారు. రాష్ట్రం లో కూటమిని అధికారం లోకి తెచ్చింది బలిజ కాపు వర్గాలు.మారేందుందుకు సామజికంగా ఆర్థికంగా రాజకీయం గా దాడులు కొనసాగుతున్నాయి.అని చందు జనార్దన్ ప్రశ్నించారు. రాష్టంలో అధికారం తెవడం ద్వారం కేంద్రం లో అధికారం తెచ్చిన ఘనత కూటమి ది దాన్ని తెచ్చిన ఘనత పవన్ కళ్యాణ్ ది కారణం బలిజ కాపులది.వెంటనే జీవో 5 రద్దు చెయాలి. దమాషా ప్రకారం రాజకీయ,ప్రభుత్వ పదవు ల్లో ప్రాధాన్యత నివ్వాలి.ప్ర భుత్వ ఉద్యోగులుపై దాడులు అపి దమాషా ప్రకారం ప్రా ధాన్యత గల స్థానాల్లో పో స్టింగ్లు ఇవ్వాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చం దు జనార్దన్ డిమాండ్ చేసా రు.రాయలసీమ ఉమ్మడి జి ల్లాల్లో ఎన్నోకల్లో అన్ని రాజ కీయ పార్టీలు బలిజలకు అ న్యాయం చేశాయని ఓటు బ్యాంకుగా మాత్రమే వాడు కుంటూ మోసం చేస్తున్నారని చందు ఆవేదన వ్యక్తం చేసా రు.బలిజ కాపు, తెలగ ఒంట రిల బీసీ రిజర్వేషన్ ఇవ్వాల ని డిమాండ్ చేస్తున్నాం.బీసీ రిజర్వేషన్,బలిజ వర్గ సమ స్యల కోసం దశల వారి ఉ ద్యమం కొనసాగిస్తూ ఆమర ణ నిరాహార దీక్ష చేస్తానని చందు జనార్దన్ ప్రకటించా రు.శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ కన్వీనర్ సోమరౌతు రామకృష్ణ మాట్లాడుతు కూ టమి ప్రభుత్వ హయం లో 15 నెలల కాలం లో నాలుగు డిఏలు పెండింగ్లో ఉన్నాయ్, పి ఆర్ సి చైర్మన్ ను ప్రకటిం చ లేదు.పి ఫ్ అకౌంట్ నగదు ఇవ్వడం లేదు,ఎన్నికల సమ యం లో సి పి ఎస్ పరిష్కా రం చేస్తానని పవన్ కళ్యాణ్ మాట ఇచ్చారని మాట నిలుపుకోవాలని సోమ రౌతు రా మ కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో పాల్గొన్న బలిజ సంఘంనేతలు చింత పండు రమణ నాగయ్య రా యల్,మంజు మాట్లాడుతూ రాయల సీమలో ఏ ప్రభు త్వం వచ్చిన బలిజల పై కక్ష సాధింపు కొన సాగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు.కూ టమి ప్రభుత్వం రావడానికి కృషి చేశామని దొమ్మరి కు లాన్ని తెచ్చి బలిజల్లో కలప డం పట్ల ఆగ్రహం వ్యక్తం చే స్తూ రాబోయే కాలం లో మా వైఖరిని చూస్తారని హెచ్చరిం చారు.పూల రమణ, నాగయ్య రాయల్,హరి,టెంకా యల ఈశ్వరయ్య,మోహన్ ఈశ్వర్,రాజు,పాల్గొన్నారు,

## జీఎస్టీ తగ్గింపుపై కూటమి నాయకుల హర్షం

**ప్రధాని, మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం**



గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు పేదలకు అందరికీ ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎన్నో వస్తువులు మందులు రైతులకు ఎరువులు వాహనాల ధరలు భారీగా తగ్గి ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేసి ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా సోమవారం శ్రీ సత్య సాయి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ ఆదేశాలతో గోరంట్ల బస్టాండ్ కూడలి దగ్గర భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు, భారతమాత ముద్దుబిడ్డ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ దేశ ప్రజలను దృష్టిలో పెట్టుకొని పేద మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని అనేక మైనటువంటి నిత్యవసర వస్తువుల పైన జివస్టి తగ్గించిన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ మరియు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు నిర్మల సీతరామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు ,ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మి నారాయణ, అసెంబ్లీ కన్వీనర్ మేదర శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి, జనసేన మండల సంతోష్, రాష్ట్ర హస్తకళ డైరెక్టర్ సోమశేఖర్, మాజీ ఎంపీపీ విద్యా ధరణి, సొసైటీ డైరెక్టర్ లు పూల గంగాధర్, నబిరసూల్, వెంకటాచలం, కాచర్ల హరీష్, భజంత్రి శంకర, శంకర్ రెడ్డి, నాగరాజ్ యాదవ్, ముంతాజ్, కురుబ మహేంద్ర, మామిడి కాయల హరి ప్రసాద్, కలీమ్ ఖాన్, మల్లేష్, మహేంద్ర, రామాంజనేయులు, నరసింహులు, గంగాధర్తోపాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్ను కలిసిన జిల్లా ఎస్పీ



పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22 : పుట్టపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో నూతన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ని మర్యాద పూర్వకంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు, అలాగే మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## తండ్రి హత్య కేసులో ఇద్దరు కుమారుల అరెస్టు

గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: తండ్రిని హత్య చేసిన కేసులో ఇద్దరు కుమారులను అరెస్టు చేసి,పెనుగొండ కోర్టుకు రిమాండ్ కు పంపినట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు. గోరంట్ల మండలంలోని ఉగ్రారం పల్లి గ్రామానికి చెందిన సోమశేఖర్ చంద్రశేఖర్ లు మద్యానికి బానిసై తల్లిని వేధిస్తుండగా తండ్రి రంగయ్య అడ్డు రావడంతో కట్టెతో తండ్రి పై దాడి చేయగా తీవ్రంగా గాయపడి కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందన్నారు. దీంతో తండ్రి హత్య కేసులో ఇద్దరు కుమారులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు మీడియాకు తెలిపారు.

**విద్యార్థి అదృశ్యం కేసు నమోదు:** గోరంట్ల మండలంలోని వెంకటరమణ పల్లి గ్రామానికి చెందిన ఏడవ తరగతి విద్యార్థిని 17వ తేదీ నుండి పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో పాటు కనపడకపోవడంతో తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు సిఐ బోయ శేఖర్ తెలిపారు.

## తోపుదుర్తి భాస్కర్రెడ్డి మృతికి నివాళులు



పెనుకొండ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22 : ఇటీవల గుండెపోటుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్ రెడ్డి మృతి చెందారు. సోమవారం తోపుదుర్తి భాస్కర్ రెడ్డి (పెద్దకర్మ)వైకుంఠ సమారాధన కార్యక్రమం సోమవారం అనంతపురం లోని రామచంద్ర నగర్ లోని వారి స్వగృహం లో నిర్వహించారు,ఈ కార్యక్రమానికి పెనుకొండ సీనియర్ లాయర్ భాస్కర్ రెడ్డి, వెళ్లి వారి మాజీ జడ్పీ చైర్మన్ స్వర్గీయ తోపుదుర్తి భాస్కర్ రెడ్డి, సతీమణి కవితమ్మ కు ధైర్యం చెప్పి, తోపుదుర్తి భాస్కర్ రెడ్డి లేకపోవడం తీరని లోటు అని మీరు ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు.

## జిల్లా కలెక్టర్ను కలిసిన ఎంపీ బీకే పార్థసారథి



పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ని తన చాంబర్ నందు మర్యాదపూర్వకంగా హిందూపురం ఎంపి బి.కె పార్థసారథి కలిశారు, జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కి ఈ సందర్భంగా ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం జిల్లా అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై వారు కొద్దిసేపు చర్చించుకున్నారు.

## తిరుపతిలో భక్త కనకదాస
## కాంస్య విగ్రహ ప్రతిస్టాపన పోస్టర్ల విడుదల

గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 22: మహా పుణ్యక్షేత్రమైన తిరుపతిలో 5 వ తేదీన జరగు శ్రీ భక్త కనకదాస కాంస్య విగ్రహ ప్రతిస్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా విగ్రహ దాత రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవితమ్మ ఆదేశాల మేరకు గోరంట్ల పట్టణ లో తిరుపతి కనకదాస విగ్రహ సభ్యులతో కలిసి గోరంట్ల కురుబ సంఘం కమిటీ సభ్యులు పోస్టర్లను విడుదల చేసారు,ఈ కార్యక్రమంలో కురుబ నారాయణస్వామి, గుమ్మయ్యగారిపల్లి శంకరప్ప, కమ్మవారిపల్లి రమేష్, కురుబ మహేంద్ర, మల్లికార్జున, బాలకృష్ణ, నాగరాజు, నవీన్, సోమశేఖర్, మల్లికార్జున, ఆంజనేయులు, గుమ్మయ్య గారి పల్లి రాము, నారాయణస్వామి, శంకర, గంగాధర్, గోవర్ధన్, కురుబ కులస్తులు పాల్గొన్నారు.

